సాక్షి
నంద్యాల
బుధవారం, 13, ఆగస్టు, 2025



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై మంగళవారం హైదరాబాద్‌కు చెందిన నృత్య గణపతి కూచిపూడి నాట్య అకాడమి వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



హుండీ ఆదాయం రూ.1.33 కోట్లు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణ మాసం మూడవ సోమవారానికి హుండీ ఆదాయం రూ.1,33,56,261, వెండి 32.700 కేజీలు, బంగారం 3.400 గ్రాములు వచ్చింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 21,910
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 21,705

న్యూస్‌రీల్

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు
దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): వచ్చే నెల 5వ తేదీన గురుపూజ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య, ఎయిడెడ్ పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల్లో పదేళ్లు పూర్తి చేసిన, అభియోగాలు లేని, క్రిమినల్ కేసులు లేని వారు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుకు అర్హులన్నారు. ఈనెల 19, 20వ తేదీలోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి దరఖాస్తులు పంపాలన్నారు.

మద్దిలేటయ్య హుండీ ఆదాయం రూ.69.12 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.69.12 లక్షలు వచ్చింది. స్వామి అమ్మవార్లకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు, ముడుపులను మంగళవారం లెక్కింపు చేపట్టారు. దేవదాయశాఖ అధికారి మోహన్, ఇన్‌స్పెక్టర్ రమేష్ పర్యవేక్షణలో ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో 76 రోజులకు సంబంధించిన హుండీ లెక్కింపు నిర్వహించారు. ఇందులో 69,12,094 నగదు, 33 గ్రాముల బంగారు, 2.300 కేజీల వెండి వచ్చింది. కార్యక్రమంలో బాలజీ సేవా ట్రస్ట్ సభ్యులు మహిళా భక్తులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

రవ్వలకొండకు దారేది?



అధ్వానంగా ఉన్న రవ్వలకొండ రహదారి

బనగానపల్లె: ఎంతో చారిత్రాత్మక విశిష్టత ఉన్న రవ్వలకొండకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో పర్యాటకులు, భక్తులు అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని గరిమిరెడ్డి అచ్చమ్మమటం, సమీపంలోని రవ్వలకొండపై ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, కాలజ్ఞానం గుహల సందర్శనకు పర్యాటకులు నిత్యం వస్తుంటారు. అయితే రవ్వలకొండకు వెళ్లే రోడ్డు కంకర తేలి శిథిలావస్థకు చేరడంతో వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలని గతంలో రూ.కోటి నిధులు కూడా మంజూరయ్యాయి. అయితే పనుల్లో జాప్యం కావడంతో నిధులు రద్దయ్యాయి. రహదారి సమస్య మాత్రం పర్యాటకులను వేధిస్తోంది. ప్రతి రోజు రవ్వలకొండను సందర్శించేందుకు సుదూర ప్రాంతాల నుంచి బనగానపల్లెకు చేరుకుంటారు. అక్కడి నుంచి వెళ్లే రహదారిలో కంకర తేలి వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రవ్వలకొండను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది మెరుగైన వసతులు కల్పించాలని గతంలో పంపిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. అధికారులు స్పందించి రవ్వలకొండకు బీటీ రోడ్డు నిర్మించాలని యాత్రికులు కోరుతున్నారు.

మొక్కజొన్న.. మురిపించేనా..!

- గతేడాది వెంటాడిన తుపాన్లు
- ఈ ఏడాది జిల్లాలో 54,150 హెక్టార్లలో సాగు లక్ష్యం
- ఇప్పటికే 101 శాతం పైగా సాగు
- మిరపకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న
- సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం



కోవెలకుంట్ల సమీపంలో సాగైన మొక్కజొన్న

కోవెలకుంట్ల: గతేడాది నష్టాలు మూటగట్టుకున్న మొక్కజొన్న రైతులు దేవుడిపై భారం వేసి ఈ ఏడాది మళ్లీ అదే పంట సాగు చేస్తున్నారు. విత్తనానికి ముందు విస్తారంగా వర్షాలు కురియడంతో సాగుకు అనుకూలంగా మారింది. బోర్లు, బావులు, చెరువులు, తదితర సాగు నీరు వనరులు అందుబాటులో ఉండటంతో లక్ష్యానికి మించి సాగు కావడం గమనార్హం. ఇటీవల ఎస్సార్బీసీ, కేసీకెనాల్, తెలుగుగంగ కాల్వల్లో నీరు పుష్కలంగా చేరడంతో సాగు విస్తీర్ణం మరింత పెరిగే ఆస్కారం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 54,150 హెక్టార్లలో మొక్కజొన్న సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు ఆయా మండలాల పరిధిలో 55,408 హెక్టార్లలో సాగైంది. ఇందులో జిల్లాలోని పాములపాడు మండలంలో అత్యధికంగా 6,745 హెక్టార్లలో, కొత్తపల్లె 5,793, పాణ్యం 5,279, నందికొట్కూరు 4,607, ఆళ్లగడ్డ 4,288, ఆత్మకూరు 4,033, బనగానపల్లె 3,964, మిడుతూరు 3,635 హెక్టార్లలో రుద్రవరం 3,225, పగిడ్యాల మండలంలో 2,406 హెక్టార్లలో మొక్కజొన్న సాగైంది. గత ఏడాది జిల్లాలోని 45,200 హెక్టార్లలో మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం కాగా ఆయా డలాల్లో 54 వేల హెక్టార్లలో సాగు చేశారు. 105 నుంచి 110 రోజులు పంటకాలం కాగా పైరు ఆరంభంలో వర్షాభా పంట చేతికందే తరుణంలో తుపాన్ వెంటాడి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరాకు 22 నుంచి 30 క్వింటాళ్లలోపే దిగుబడులు రావడంతో నష్టాల ఊబిలోకూరకపోయారు. మార్కెట్‌లో క్వింటా రూ. 2,200 మించి పలకపోవడంతో నష్టాలు మూటగట్టుకున్నారు.

కత్తెర పురుగు భయం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మొక్కజొన్న రెండు నెలల దశలో ఉండగా కొన్ని ప్రాంతాల్లో నెల రోజుల దశలో ఉంది. ముందుగా సాగు చేసిన మొక్కజొన్నను కత్తెర పురుగు వెంటాడే ఆస్కారం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పైరును కత్తెర పురుగు ఆశిస్తే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనుంది. సుంకుదశలో ఉన్న మొక్కజొన్న పైరు ను భారీ వర్షాలు వెంటాడుతున్నాయి. మొక్కజొన్న కంకి కట్టే దశలో భారీ వర్షాలు కురిస్తే నష్టం చేకూరుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో కోటి ఆశలతో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులకు ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయా, ప్రకృతి వైపరీత్యాలు మరోసారి దెబ్బతీస్తాయన్న ఆందోళన నెలకొంది.

మిరపకు ప్రత్యామ్నాయంగా..

రెండేళ్ల నుంచి మిర్చి సాగు రైతుల కళ్లలో కారం కొడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు మిర్చి ఎర్ర బంగారం కాగా గత ఏడాది నుంచి భారంగా మారింది. 2021-22, 2022-23 సంవత్సరాల్లో క్వింటా ఎండు మిరపకాయలు రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు ధర పలికాయి. గతేడాది నుంచి ధరలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. గతేడాది నవంబర్ నెలలో క్వింటా రూ. 15 వేల నుంచి రూ. 16 వేలు పలుకగా ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ధర రూ. 10 వేలకు పడిపోయింది. మిరప సాగుకు ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 1.25 లక్షల వరకు ఖర్చు వస్తుంది. మిర్చికి తెగుళ్లు ఆశించడం, దిగుబడులు గణనీయంగా తగ్గడమేకాకుండా గిట్టుబాటు ధర లేకపోవడంతో గతేడాది ఎకరాకు రూ. 50 వేల నష్టం వాటిల్లింది.



దీంతో ఈ ఏడాది మిరప సాగు చేయాలంటే నే రైతులు భయపడుతున్నారు. జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో 5-6 వేల హెక్టార్లకు మించి మిరప సాగయ్యే సూచనలు లేవని ఉద్యానవన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాది మిరపసాగుతో తీవ్రంగా నష్టపోయిన రైతులు ఈ ఏడాది అంత మొత్తం పెట్టుబడి పెట్టి సాగు చేసేందుకు సాహసం చేయడం లేదు. మిరపకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న విస్తారంగా సాగైంది. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, మూడు నుంచి నాలుగు సాగునీటి తడులు, కోత, నూర్పిడి, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేలు పెట్టుబడులు వెచ్చించాల్సి ఉంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మొక్కజొన్న రెండు నెలల దశలో ఉండగా కొన్ని ప్రాంతాల్లో నెల రోజుల దశలో ఉంది. జిల్లాలో సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది.


ఐదు ఎకరాల్లో సాగు చేశా



ఈ ఏడాది ఐదు ఎకరాల సొంత పొలంలో నెల రోజుల క్రితం మొక్కజొన్న పంట సాగు చేశాను. పెట్టుబడుల రూపంలో ఇప్పటి వరకు ఎకరాకు రూ. 12 వేలు వచ్చింది. గత ఏడాది రెండు ఎకరాలు సాగు చేయగా ఏడాది అదనంగా మరో మూడు ఎకరాల్లో వేశాను. నాలుగు నెలల పంటకాల కాగా ఇప్పటి వరకు పైరు ఆశాజనకంగా ఉంది.

– రాంభూపాల్‌రెడ్డి, రైతు, కోవెలకుంట్ల

ఈ ఏడాది దిగుబడులపై ఆశలు



గత ఏడాది మొక్కజొన్న సాగు చేసి నష్టాలు చవి చూశాను. ఈ ఏడాది ఎకరా రూ. 15 వేలు మేరకు మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని రెండు నెలల క్రితం మొక్కజొన్న పంట సాగు చేశాను. పెట్టుబడుల రూపంలో ఇప్పటి వరకు ఎకరాకు రూ. 10 వేలకు పైగా పెట్టాను. వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ ఏడాది సాగు కలిసొస్తుందని భావిస్తున్నాను.

– కృష్ణారెడ్డి, రైతు, భీమునిపాడు, కోవెలకుంట్ల మండలం

దేశభక్తి ఉప్పొంగేలా హర్ ఘర్ తిరంగా !



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజల్లో దేశభక్తి ఉట్టిపడేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మంగళవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని పురస్కరించుకుని టెక్కె మా ర్కెట్ యార్డ్ నుంచి గాంధీ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా మంత్రి, కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు జిల్లా అధికారులు కలిసి 100 మీటర్ల జాతీయ పతాకం ర్యాలీలో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశమంతా ప్రజలు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలు ఉత్సాహంగా జరుపుకుంటున్నారని, ప్రతి ఒక్కరూ దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల జీవిత గాథలను గుర్తు చేసుకుని దేశ అభివృద్ధికి పునరంకితమవ్వాలని పిలుపునిచ్చారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జరుపుకుంటున్నామన్నారు. నేపథ్యంలో స్వాంతంత్రత్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగనిరతిని, వారు దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పర్యాటక అధికారి సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి ..



4 రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా నీటివిడుదల

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం రేడియల్ క్రస్ట్‌గేట్లను ఈ ఏడాది మూడవసారి తెరిచారు. జలాశయానికి ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని మంగళవారం 4 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేరకు తెరచి 1,08,628 క్యూసెక్కుల నీటని దిగువకు వదులుతున్నారు. సోమవారం నుంచి మంగళవారం వరకు జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి 2,27,094 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 1,05,606 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. విద్యుత్ ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 69,988 క్యూసెక్కులు, బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 32,000 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,818 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పరిసర ప్రాంతాలలో 4.20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కుడిగట్టు కేంద్రంలో 15.107 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 16.802 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. మంగళవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 204.3520 టిఎంసీల నీరు లభ్యతగా ఉంది. డ్యాం నీటిమట్టం 883 అడుగులకు చేరుకుంది.

96 శాతం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

గోస్పాడు: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం 96 శాతం అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం పూర్తి చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 4,38,475 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసేలా గుర్తించగా అందులో 4,22,251 మంది పిల్లలకు మాత్రలు అందజేశామన్నారు. ఒక్కరోజులోనే వైద్య సిబ్బంది జిల్లా అంతటా పిల్లలకు మాత్రలు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 20వ తేదీన మాప్‌అప్‌డే రోజున అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మిగిలిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మహాద్వారం కూడలిలో అశేష భక్తజన వాహిని మధ్య రాయరు రథం

భువనమోహనుడికి బ్రహ్మరథం

- అశేష జనవాహిని మధ్య సాగిన రాఘవేంద్రుల రథయాత్ర
- అలరించిన కళాకారుల నీరాజనాలు

మంత్రాలయం: భువనమోహనుడు మహారథంపై ఊరేగిన వేళ.. తుంగభద్రమ్మ మది పులకించిపోయింది. వేదభూమి పరవశించి ఆధ్యాత్మిక పరిమళాలతో శోభిల్లింది. భక్తజనం హర్షధ్వానాలతో జపించింది. రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం మహారథోత్సవం కనులపండువగా సాగింది. ఉత్తరారాధనలో భాగంగా ముందుగా ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు వేద పాఠశాలకు మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా చేరుకున్నారు. అక్క డ పాఠశాల విద్యార్థులు ఉత్సవమూర్తికి వేద పఠనం గావించి దర్శించుకున్నారు. అనంతరం శ్రీమఠం మూల బృందావనం చేరుకోగా స్వామి వారికి విశేష పూజలు గావించి వసంతోత్సవానికి శ్రీకారం పలికారు. గర్భాలయంలో అర్చకులు, పండితులు, పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు గులాలు చల్లుకుని ఆచార వైభవాన్ని స్పృశింపజేశారు. అనంతరం ఉత్సవమూర్తిని మహారథంపై కొలువుంచగా.. భక్తజనులు గోవిందా.. గోవిందా.. అంటూ ప్రణమిల్లుతూ దర్శించుకు న్నారు. పీఠాధిపతి ప్రవచనం ముగియగానే భక్తులను ఆశీర్వచనం చేస్తూ 12.15 గంటలకు రథయాత్రకు అంకురార్పణ పలికారు. మధ్వ కారిడార్ చేరుకోగానే స్వామిజీ హెలికాప్టర్‌తో పుష్పవృష్టి కురిపించారు. మంగళ వాయిద్యాలు, డోలు దరువులు, రంగుల ఆటలు, యువతుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, కోలాటాల మధ్య మహారథం ముందుకు కదిలింది. రాఘవేంద్ర సర్కిల్ వద్ద స్వామిజీ పూర్వాశ్రమ కుటుంబ సభ్యులు ఉత్సవమూర్తికి పూజలు చేసుకుని మొక్కు లు తీర్చుకున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ రథోత్సవంలో పాల్గొన్నారు. డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు సిబ్బందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



ఊరేగింపుగా ఉత్సవమూర్తిని తీసుకొస్తున్న దృశ్యం



వసంతోత్సవంలో పీఠాధిపతి, పండితులు

రూ.250 కోట్లతో జలాశయం

మంత్రాలయం క్షేత్రం సౌకర్యార్థం రూ.250 కోట్లతో జలాశయాన్ని నిర్మిస్తున్నట్లు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. వేడుకలో స్వామిజీ ప్రసంగిస్తూ క్షేత్రంలో అంతర్గత రహదారులతో పాటు రింగ్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాఘవేంద్ర సర్కిల్ వరకు కారిడార్ నిర్మిస్తామన్నారు. శ్రీమఠం దినదినాభివృద్ధికి అంతరంగిక భక్తుల సహకారం ఎంతో ఉందన్నారు. వేడుకల్లో పండిత కేసరి రాజా ఎస్. గిరియాచార్, తహసీల్దార్ రమాదేవి, శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, మేనేజర్-3 శ్రీపతి ఆచార్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎస్పీ విక్రాంత్‌పాటిల్



కళాకారుల ప్రదర్శన

కూటమి సర్కార్ 'రాజకీయ కూల్చివేతలు'

- వైఎస్సార్‌సీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి కాంపౌండ్ వాల్ కూల్చివేత

ఆళ్లగడ్డ: నంద్యాల నియోజకవర్గంలో రెడ్ బుక్ రాజ్యాంగం కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా అధికారులను అడ్డుపెట్టుకుని రాజకీయ కూల్చివేతలకు తెర తీశారు. ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆమె భర్త భార్గవ్‌రాం కక్ష సాధింపునకు అధికారులు బేషరతుగా జీ హుజూర్ అంటున్నారు. వైఎస్సార్‌సీపీ నేతల నిర్మాణాల కూల్చివేతలే లక్ష్యంగా భార్గవ్ డైరెక్షన్‌లో అధికారులు యాక్షన్ ప్లాన్ అమలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్‌రెడ్డి తన స్థలానికి ఎప్పుడో నిర్మించుకున్న ప్రహరీ కూల్చివేతకు అధికారులు యత్నించడం మంగళవారం పట్టణంలో ఉద్రిక్తతకు దారి తీసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర కార్యదర్శి భూమా కిషోర్‌రెడ్డికి సర్వే నెం.574/2 లో 3.50 ఎకరాల పొలం ఉంది. ఈ స్థలం కబ్జాకు గురి కాకుండా సుమారు 4 సంవత్సరాల క్రితం చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారు. అఖిలప్రియ ఎమ్మెల్యే అయిన మొదటి రోజు నుంచే ఆమె భర్త భార్గవరాం రాజకీయ కక్ష సాధింపులో భాగంగా ఈ ప్రహరీ కూల్చివేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేస్తున్నారు. అధికార పార్టీ నేత ఒత్తిడికి తలొగ్గిన కమిషనర్ గోడ కూల్చేందుకు జేసీబీ తీసుకునిపోయి కూల్చివేత మొదలు పెట్టారు. అంతలో భూమా కిషోర్ రెడ్డి తన అనుచరులతో అక్కడికి చేరుకుని కమిషనర్ కిషోర్‌తో వాగ్వాదానికి దిగి కూల్చివేతను అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది.



కాంపౌండ్ వాల్ కూల్చివేస్తున్న దృశ్యం



అక్రమ కూల్చివేతను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నిర్మాణానికి అనుమతులు లేవంట..

గోడ కూల్చేందుకు వచ్చిన కమిషనర్‌ను ఎందుకు కూల్చుతున్నారని అడగ్గా ముందుగా గోడ నిర్మాణానికి అనుమతులు లేవని, అనంతరం గోడ అంత ఎత్తు కట్టుకోకూడదని.. మరోసారి పక్కన అనుమతులు లేకుండా ప్లాట్‌లు వేశారని ఇలా పొంతన లేని మాటలు చెప్పడం అక్కడున్న వారికి వింతగా అనిపించింది. అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మించారంటే ఇదే సర్వే నంబర్‌లో పదుల సంఖ్యలో ప్రహరీలు నిర్మించారు. ఎత్తుగా ఉందంటే దీని పక్కనే ఎమ్మెల్యే నిర్మాణం సుమారు 10 అడుగుల ఎత్తు ఉంది, మరి వీటన్నింటిజోలికి పోకుండా ఇక్కడకే రావడం ఏంటని ప్రశ్నించారు. కక్ష సాధింపు కాకుంటే పక్కనున్న వాటిపై కూడా కమిషనర్ చర్యలు తీసుకోవాలి కదా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు

ఆళ్లగడ్డలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆస్తులను టార్గెట్ చేసి ఎమ్మెల్యే అఖిలప్రియ, ఆమె భర్త భార్గవరామ్ చేస్తున్న దౌర్జన్య కాండకు ప్రజలే బుద్ధి చెబుతారు. ఇదే సర్వే నంబర్‌లో ఉన్న నిర్మాణాలు అధికారులకు కనిపించవా? వాటిపై కూడా చర్యలు తీసుకోవాలి కదా. రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు అధికారపార్టీ నేతలు ఎలా చెబితే అలా తలాడించడం విచారకరం.

– భూమా కిషోర్‌రెడ్డి